క్లుప్తంగా

లక్ష్మీగణపతి ఆలయంలో సంకట హర చతుర్థి పూజలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి ఉప్పర కాలనీ (కెఎస్ఎన్ రెడ్డి నగర్)లోని శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి పూజలు చేశారు. నూతన సంవత్సరంలో ప్రథమ సంకటహర చతుర్థి సందర్భంగా ఆలయ కమిటీ విశేష పూజలు నిర్వహించింది. 79వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.నగేష్‌ను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో గ్రామ నాయకులు నక్కా లక్ష్మణరావు, బి.సత్యనారాయణ, కె.జగదీష్, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎల్‌టీటీ, స్వర్ణజయంతి'కి దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలి

అగనంపూడి: విశాఖ – ముంబయి మధ్య నడుస్తున్న ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, విశాఖ నుంచి నిజాముద్దీన్ వరకు నడుపుతున్న స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌లకు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కాటం ఎస్.ఎస్. చంద్రరావు వినతిపత్రంలో కోరారు. జీవీఎల్‌ను విశాఖలో కలిసిన చంద్రరావు ఈ ప్రాంత ప్రయాణికులకు అనువుగా ఉండేలా ఆ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

వార్డులో సమస్యల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పర్యటించారు. స్థానికులు, నాయకుల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదుల మేరకు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. సమస్యలను గుర్తించడంతో పాటు అభివృద్ధి పనులను పరిశీలించారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలను పరిశీలించారు. ఇప్పటి వరకు గ్రామంలో నిర్మాణాలను పూర్తి చేసుకున్న రోడ్లను పరిశీలించి, వాటి నాణ్యతను జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్, కాంట్రాక్టర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో మంగళవారం ద్విచక్ర వాహనం నుంచి పడిపోయిన సంఘటనలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివి.. స్థానిక సెక్టార్–6లోని 325 క్వార్టర్‌లో నివసిస్తున్న ఎస్. సురేఖ (33) స్కూటీపై పిల్లలను పాఠశాల వద్ద దించి వస్తుండగా, విశాఖ విమల విద్యాలయం వద్దకు వచ్చేసరికి స్కూటీ రాయిపైకి ఎక్కడంతో అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ సంఘటనలో ఆమె తలకు, ముఖంపై గాయాలవడంతో వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతున్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరెస్టులపై నిరసన



ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

గాజువాక: పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన సందర్భంగా తమ నాయకులను పోలీసులు అరెస్టు చేయడంపై మున్సిపల్ కార్మికులు నిరసనకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.సుబ్బారావు మాట్లాడుతూ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నిరసన తెలిపితే, ప్రభుత్వం అక్రమ అరెస్టులను చేయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నంబర్ ఒకటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, రమణ, ఎం.రాంబాబు, ఎ.లోకేష్, కె.కిరీటం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో విశాఖ అభివృద్ధి

- అదే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం
- మేయర్ హరివెంకటకుమారి
- 71, 87 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తోకాడలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అని నగర మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 71వ వార్డు తోకాడ గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య, ఐటీ రంగాల్లో ప్రపంచ స్థాయిలో పోటీ పడగల సత్తా విశాఖకు ఉందన్నారు. పరిపాలనా రాజధానిగా విశాఖ అన్ని విధాలా అనుకూలమనే భావనతోనే సీఎం ఎంపిక చేశారని చెప్పారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో ఇప్పటికే 80 శాతం పైగా రోడ్లు, కాలువలు, మంచినీరు, శ్మశానవాటికల అభివృద్ధి వంటి పనులు చేపట్టామన్నారు. అనంతరం 71వ వార్డులో శ్మశానవాటిక, డ్రైనేజీలను పరిశీలించారు. వార్డులో రోడ్లు, విద్యుత్ స్తంభాలు, జిమ్, వాకింగ్ ట్రాక్, గ్రామ సచివాలయాలను నిర్మించాలని కార్పొరేటర్ రాజాన రామారావు మేయర్‌ను కోరారు. కార్యక్రమంలో జెడ్సీ పి.సింహాచలం, ఈఈ ప్రసాదరావు, తోకాడ పౌర సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు కంటి మహంతి గోవిందరావు, కోశాధికారి డి.వి.ప్రసాదరావు, తోకాడ వర్క్‌షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు సుబ్రమణ్యం, లావణ్య, భారతి, రమేష్, ఏఈలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

87వ వార్డులో రూ.73.35 లక్షలతో అభివృద్ధి పనులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో సుమారు రూ 73.35 లక్షలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మేయర్ గొలగాని వెంకటహరికుమారి ముఖ్య అతిథిగా పాల్గొని పూజ చేసి పనులను ప్రారంభించారు. అప్పికొండ, ముస్లింవీధి, విశ్వబ్రాహ్మణ వీధి, తెలుకులవీధిలో 15.08 లక్షల వ్యయంతో డ్రెయిన్లు, కల్వర్టులు, శివాజీనగర్‌లో 19.36 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, కల్వర్టులు, కణితి యాదవ వీధి, సిద్ధార్థ నగర్‌లో 19.08 లక్షల వ్యయంతో ఆర్.సీ.సీ రోడ్లు మరియు కల్వర్టులు మరియు అప్పరవానిపాలెం, దుగ్గపువానిపాలెంలో 19.11 లక్షల సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, జెడ్సీ సింహాచలం ఈఈ ప్రసాద్‌బాబు, ఏఈ తులసి, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, ఎన్నేటి రమణ , దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, కోమటి రమాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మిక ప్రజా గర్జన' విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న కార్మిక ప్రజా గర్జనను విజయవంతం చేయాలని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణ నిర్ణయం వెల్లువడి రెండేళ్లు అవుతోందని, అప్పటి నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు కొనసాగుతున్నాయన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉక్కు త్రిష్ణ మైదానంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, బి.ఎస్. రాజు, బీఎంకె నాయక్, జగదీష్‌కుమార్, గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం శ్రీనివాసరావు

ఉక్కునగరం: డాక్టర్ బి. ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కల్పించిన హక్కుల పరిరక్షణకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు అన్నారు. 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ రిజర్వేషన్ పాలసీస్ ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్' అనే అంశంపై ఉక్కు హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రెసిడెన్షియల్ డైరెక్టివ్స్‌ను యాజమాన్యం మొదటి నుంచి అమలు చేస్తోందన్నారు. హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ తమ విజ్ఞప్తి మన్నించి సదస్సు ఏర్పాటు చేసిన హెచ్‌ఆర్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లైజన్ ఆఫీసర్ వి. తిరుపతిరావు, నాయకులు బి.తౌడన్న, ఎస్.సత్యనారాయణ, ఎస్.మోహన్‌బాబు, పుల్లారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ఐక్యంగా కృషి



ప్రసంగిస్తున్న సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు

గాజువాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు దళితులంతా ఐక్యంగా కృషి చేయాలని కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. వెదుళ్లనరవలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా కేబీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్రలను పన్నుతోందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో దళితులందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ గాజువాక జోన్‌లో గల 20 వార్డులలో మూడు వార్డులను ఎస్సీలకు, ఒక వార్డును ఎస్టీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ దళితులంతా ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారాన్ని సాధించగలుగుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, నందికోళ్ల అప్పారావు, పి.ముత్యాలు, బలిరెడ్డి శ్రీను, బి.ఎ.స్వామి, బత్తిన సత్తిబాబు, యోహాన్, చంద్రమౌలి, బాబా సాహెబ్, నీలకంఠం, ఈలి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



కార్మికురాలికి దుప్పటి అందిస్తున్న మేయర్ వెంకటహరికుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు అభినందనీయమని మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి నాయీబ్రాహ్మణవీధి సామాజిక భవనంలో ఫ్రెండ్స్ బీసీ వేల్ఫేర్ సొసైటీ 17వ వార్షికోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. వారికి సంక్రాంతి కానుకలను, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోండా జగన్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, జెడ్సీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



దీక్షా శిబిరంలో పాల్గొన్న నిర్వాసితులు, అఖిలపక్షాల నాయకులు

- నిర్వాసితుల ఐక్య సంఘం డిమాండ్
- 36గంటల నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభం

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ నిర్వాసితుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో అగనంపూడి కూడలిలో 36 గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. మంగళవారం ఉదయం 6 గంటలకు దీక్ష ప్రారంభించారు. అఖిలపక్షాల నాయకులు నెల్లి శ్రీనివాసరావు, కర్రి దోశేంద్ర, జె. నరసింగరావు,జి.సోమశేఖర్ మాట్లాడుతూ అర్హులైన నిర్వాసితులకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, కె.పరంధామయ్య, జి.రామకృష్ణ, బి.సత్యనారాయణ, జి.అప్పారావు, పైడికొండ, కరణం సత్యారావు తదితరులు ప్రసంగించారు. నిర్వాసితుల ఐక్య వేదిక నాయకులు యు.అప్పారావు, జి.చిన్న, కె.జగదీష్, ఉక్కు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు, శ్రమశక్తి ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న శ్రీను

పెదగంట్యాడ: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను అన్నారు. వార్డు పరిధిలోని దిబ్బపాలెం సచివాలయంలో నవరత్నాలు–అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు మంగళవారం ఆయన రెండో విడత పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నొల్లి భూలోకరావు, కదిరి తాతారావు, స్వామి, కంటుముచ్చు పద్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు

కూర్మన్నపాలెం: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మతిస్థిమితం లేని సింహాద్రి (63) అనే వ్యక్తిని అతని కుమార్తె త్రిసుర్ల అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం చేర్పించి, వెళ్లిపోయారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ వ్యక్తి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసిన దువ్వాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని దువ్వాడ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సంగీత నృత్య మహోత్సవంలో లాస్యకు పతకం




గాజువాక: ప్రపంచ రికార్డు కోసం ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యుజీషియన్స్ అండ్ డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత నృత్య మహా మహోత్సవంలో గాజువాకకు చెందిన ఎం.లక్ష్మీ లాస్యకు పతకం, ప్రశంసా పత్రం లభించాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై గత నెల నిర్వహించిన అయిగిరి నందిని స్తోత్రం ఆలాపనలో ప్రతిభ ప్రదర్శించిన లక్ష్మీ లాస్యకు నిర్వాహకులు పంపించిన పతకం, ప్రశంసా పత్రం మంగళవారం అందాయి. ఈ సందర్భంగా గాజువాక శిష్టకరణం సంఘం ప్రతినిధులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు, కరకవలస గౌరీ ప్రసాద్ తదితరులు చిన్నారిని అభినందించారు.

18 నుంచి సిటూ మహాసభలు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. భెల్ ప్రవేశగేటు వద్ద మంగళవారం సిటూ జెండాను ఆవిష్కరించారు. సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, నాయకులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో విజయం



శిబిరంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనతో కార్మికులపై కక్ష గట్టిన కేంద్రప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి సభ్యుడు చలసాని శ్రీనివాసరావు అన్నారు. ఐక్య పోరాటాలతో విజయం సొంతమవుతుందని, అందరూ కలసికట్టుగా పోరాడాలని సూచించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 698వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలువురు బీఎఫ్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, యు.రామస్వామి, కారు రమణ, సీహెచ్ సన్యాసిరావు, మహాలక్ష్మినాయుడు, డి. శ్రీనివాస్ మాట్లాడారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో రామకోటేశ్వరరావు, మంత్రి రవికిరణ్, టి ఈశ్వరరావు, పివి నగేష్, అప్పారావు, నల్ల రవి, శ్రీనివాసరాజు, రొంగలి వెంకటరావు, సూర్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎంపీ జీవీఎల్



కళాశాలలో సంక్రాంతి సందడి

పెదగంట్యాడ: బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కేఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వేశారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ భావి తరాలకు మన ఆచార వ్యవహారాలను తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు జీవీఎల్ తన సతీమణి మైథిలితో కలసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, బీజేపీ నాయకులు గూటూరు శంకరరావు, బాటా శ్రీనివాసరావు, జ్యోతి, నాగేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సంబరాలు

అగనంపూడి: అగనంపూడి సమీపంలోని గొన్నా ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాలల ఆవరణల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉత్సవాలను గొన్నా విద్యాసంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు ప్రారంభించారు. భోగి మంటలు, గంగిరెద్దుల ఆటలు, గొబ్బెమ్మలు, విద్యార్థుల కోలాటాలు, బొమ్మల కొలువులతో ఆవరణంతా సందడిగా మారింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజా మహోత్సవాలు



డాక్టర్ మహాకుల్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఉక్కునగరం: మాస్టర్ ఈకే హీలింగ్ సర్వీస్ ఆధ్వర్యంలో గురుపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సెక్టార్–1లోని సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో మంగళవారం వేకువజామున లక్ష్మీనారాయణ షోడశోపచార పూజలు చేశారు. రుత్విక్కులు రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం సామూహిక బంతి భోజనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉక్కు జనరల్ ఆస్పత్రి మాజీ జీఎం డాక్టర్ ఎస్.కె.మహాకుల్‌ను ఘనంగా సత్కరించారు. సత్యసాయి సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, ఎస్.ఎ. నాయుడు, కె.ఎస్.ఎన్.రాజు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో ఉజ్వల భవిష్యత్తు



పథకాల లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 67వ వార్డు అశోక్‌నగర్ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యం ఇస్తూ సీఎం జగన్ పాలన ఉందన్నారు. చివరి దరఖాస్తుదారుడి వరకు అందరికీ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు పల్లా పెంటారావు, రాజాన వెంకటరావు, రాజేష్, జి.లలిత, చిత్రాడ అప్పారావు, కామినాయుడు, చిప్పల అన్నపూర్ణ, లక్ష్మి, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం అడ్డగింత

- బారిక మాన్యం అంటూ పనులను అడ్డుకున్న స్థానికులు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సద్దుమణిగిన వివాదం



ఆందోళనకారులను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగానికి చెందిన స్థలంలో ప్రహరీ నిర్మాణం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని అగనంపూడికి చెందిన కొంతమంది స్థానిక ఆందోళన కారులు అడ్డుకోవడంతో, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అగనంపూడి సర్వే నంబర్ 56లో 32 ఎకరాల్లో 6.87 ఎకరాల స్థలం విశాఖ ఉక్కు కర్మాగారానికి దఖలు పడి ఉంది. ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి, మొక్కలు నాటేందుకు విశాఖ ఉక్కు పరిపాలన విభాగం అధికారులు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు సన్నాహాలు చేశారు. అయితే 15 కుటుంబాల వారు ఆ స్థలం బారిక మాన్యంగా తమకు కేటాయించారని తెలిపారు. స్థల వివాదం న్యాయస్థానంలో ఉండగా ఎలా మొక్కలు నాటుతారని వాదనకు దిగారు. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళనకారులు వారించి పనులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.

ఉక్కు అధికారులు మాత్రం అప్పట్లో బారిక మాన్యంగా కొంతమందికి స్థలం కేటాయించారని, స్థలాన్ని స్వాధీనం చేసుకోకపోవడంతో తరువాత ప్రభుత్వం పట్టాలు రద్దు చేసిందని చెబుతున్నారు. అయినా ఆ స్థలాన్ని పట్టాలు పొందిన వ్యక్తులు అమ్మేయడంతో సదరు వ్యక్తులు న్యాయస్థానంలో కేసు వేశారని, న్యాయస్థానం స్టీల్‌ప్లాంట్‌కు అనుకూలంగా తీర్పునివ్వడంతో మొక్కలు నాటుతున్నామని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆందోళన కారులు మొరాయించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిపాలనా విభాగం హెచ్‌వోడీ వై.చంద్రశేఖర్ రావు, డీజీఎం వి.భాస్కరరావు, అధికారి బాలరాజు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్, గాజువాక,దువ్వాడ సీఐలు పరిస్థితిని పర్యవేక్షించారు.

10మంది అరెస్ట్

ఉక్కునగరం: అగనంపూడిలోని స్టీల్‌ప్లాంట్ స్థలంలో ప్రహరీ నిర్మాణం, మొక్కలు నాటే పనులను అడ్డుకున్న 10 మందిపై కేసు పెట్టామని స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు తెలిపారు. చింతల అగ్రహారానికి చెందిన బోని గణేష్, అగనంపూడి ఎస్సీ కాలనీకి చెందిన గుంట్ల అప్పారావు, బి. రమణబాబు, డి. చిన్నారావు, ఆర్. మరియమ్మ, ఎస్. దేముడమ్మ, ఎస్. అప్పలనరసమ్మ, ఎస్. నూకాలమ్మ, ఎస్. జగ్గయ్యమ్మ, ఎస్. కొండమ్మలను సెక్షన్ 151 ప్రకారం, ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్ట్ చేశామన్నారు.

కిమ్స్ ఐకాన్‌లో అరుదైన చికిత్స



రోగితో డాక్టర్ వెంకటేష్ పోతుల

అక్కిరెడ్డిపాలెం: మెదడులో రక్తనాళం ఉబ్బిన (బ్రెయిన్ ఎన్యూరిజం) వ్యక్తికి ఎండోవాస్క్యులర్ కాయిలింగ్ నిర్వహించి, అతని ప్రాణం కాపాడారు షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు. ఈ చికిత్సకు సంబంధించి, ఆస్పత్రికి చెందిన న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ పోతుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం విశాఖ ప్రాంతానికి చెందిన 46 ఏళ్ల వ్యక్తి తీవ్రమైన తలనొప్పి, వాంతులతో స్పృహ కోల్పోవడంతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకువచ్చారని తెలిపారు. సీటీ స్కాన్‌లో మెదడులో రక్తస్రావం జరిగినట్లు గుర్తించామన్నారు. మెదడులో రక్తనాళం ఉబ్బి, పగిలిపోయి రక్తస్రావం కావడంతో తలనొప్పి వస్తోందని గుర్తించినట్లు తెలియజేశారు. అత్యవసర చికిత్స అవసరం కావడంతో ఎండోవాస్క్యులర్ కాయిలింగ్ చేసినట్లు తెలిపారు. ఆయనకు తొడ రక్తనాళం ద్వారా మెదడు ఎన్యూరిజంకు కాయిలింగ్ చేసినట్లు చెప్పారు. తలపై ఎటువంటి రంధ్రం, కోత లేకుండా చికిత్స చేశామన్నారు. ఈ శస్త్రచికిత్సలో కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ ఆర్.ఓంకారేశ్వర్, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ సుజిత్ తదితరులు సహకరించారని చెప్పారు. ఆయన పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.